తాగు నీటి సమస్య పరిష్కారానికి కృషి

రెబ్బెన, జనవరి 13: గోలేటి గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు గోలేటి గ్రామ సర్పంచ్ పొటు సుమలత అన్నారు. గోలేటి గ్రామపంచాయతీ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్ 7వ వార్డు బాలాజీ విగ్నేశ్వర మండలి వద్ద శనివారం నూతన బోర్‌వెల్ కోసం కొబ్బరి కాయ కొట్టి పూజ చేసి ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వార్డుమెంబర్ ఎర్ర స్వప్న, నాయకులు కుమ్మరి మల్లేశ్, సంతోశ్, గజ్జెల సత్తయ్య, శంకర్, ఎగ్గే పరదేశి, రవి, సుమన్, గజ్జెల సువర్ణ, కుమ్మరి లావణ్య, ధన పలువురు ఉన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎస్ఐ

దహెగాం,జనవరి 13: సంక్రాంతి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాటుపడకుండా శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై సనత్ కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా కోడి పందాలు, జూదం వంటి నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే సమాచారం అందించాలన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

రెబ్బెన, జనవరి 13: క్రీడలు మానసికోల్లాసానికి దోహద పడుతాయని రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. గోలేటి గ్రామ పంచాయతీలో గోలేటి గ్రా మ యూత్ ఆధ్వర్యంలో మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సర్వసాధార ణమని, క్రీడా స్ఫూర్తితో రాణించి పతకాలు సాధించాలని సూచించారు. గోలేటి యూత్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మంచిమార్గంలో నడుస్తూ అందరికి ఆదర్శవంతంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. ఎంపీటీసీ లావుడ్య సాగరమ్మ సేవా లాల్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రవినాయక్, అజ్మీర బలరాంనాయక్, భిక్కునాయక్, దుప్ప నాయక్, అజ్మీర బాబురావు, రాజు నాయక్, రెఫరీ నరేశ్, నిర్వాహకులు అరవింద్, సేవానాయక్, పవన్, అర్జున్ ఉన్నారు.

పూజలందుకునే జంగుబాయి గుహలు

జంగుబాయి వేడుకలు జరిగే ప్రదేశంలో నిర్మించిన షెడ్లు

నేడు జంగుబాయి గుహల్లో దీపోత్సవం

- రేపటి నుంచి వేడుకలు ప్రారంభం
- నెల రోజుల పాటు సాగనున్న జనజాతర
- అన్ని ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

మొక్కులు చెల్లించే రావుడ్క పేన్

ఆలయానికి వెళ్లేందుకు నిర్మించిన బీటీ రోడ్డు

కెరమెరి, జనవరి 13: ఆదివాసీల వరప్రదాయిని జంగుబాయి గుహల్లో ఆదివారం కటోడాల ఆధ్వర్యంలో దీపోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. దీంతో సోమవారం నుంచి భక్తుల కోలాహలం మధ్య జనజాతర ప్రారంభం కానుంది. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని మహారాజ్‌గూడ అటవీ ప్రాంతం సహ్యాద్రి పర్వతంలోని గుహ ల్లో జంగుబాయి కొలువైంది. భక్తుల వరాలను నెరవేర్చే అమ్మవారి దర్శనం కోసం యేటా వేల సంఖ్యలో భక్తులు ఇక్కడికి తరలివచ్చి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడ జరిగే సంస్కృతి, సంప్రదాయాలు అన్నింటికీ భిన్నంగా కనిపిస్తాయి. తరతరాలుగా వస్తున్న ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలను ఇప్పటికీ ఆదివాసీలు ఆచరిస్తూ సనాతనధర్మాన్ని కాపాడుతున్నారు. ఆదివాసీ పెద్దలు చెప్పిన ప్రకారం చిన్నతనంలోనే ఎంతో పరిపూర్ణమైన విజ్ఞానంతో జన్మించిన జంగుబాయి దేవత తల్లి తండ్రులకు దూరంగా ఉంటూ లోక కల్యాణం కోసం పాటి పడిందన్నారు. తన కోసం ప్రత్యేక స్థావరాన్ని ఎంచుకునేందుకు తీవ్ర స్థాయిలో అనేక ప్రాంతాలను అన్వేషించిన్నట్లు పురాణాల్లో ఉంది. ముందుగా డేడ్రా(బజార్‌హత్నూర్) గ్రామంలోని 'రాయల్‌ఖోరి' అనే ప్రాంతంలో నివాసం ఉన్నట్లు సమాచారం. ఆ తర్వాత ఇంద్రవెల్లి మండలంలోని దొండంద గ్రామ శివారులోని 'జంగున్‌భుయారి'లో బస చేసిన్నట్లు ప్రచారంలో ఉంది. ఇప్పటికీ ఆదివాసీలు ఆ ప్రాంతంలో అమ్మవారికి పూజలు చేయడం ఆచారంగా వస్తోంది. ఆ తర్వాత అక్కడి నుంచి తన శాశ్వత ప్రాంతంగా కోట పరందోలిలోని మహారాజ్‌గూడ అటవీ సమీపంలో సహ్యాద్రి పర్వతంలోని గుహల్లో కొలువైందని ఆదివాసీల నమ్మకం. ప్రతి సంవత్సరం పుష్యమాసంలో నెల రోజులు వేడుకలు జరుపుకుంటూ మొక్కులు చెల్లించడం సాగుతున్నది.

● దీపోత్సవతో వేడుకలు షురూ..

దీపోత్సవ కార్యక్రమంతో ప్రారంభమయ్యే జంగుబాయి వేడకలకు కటోడాలు ఆదివారం బయలుదేరనున్నారు. రాత్రిపూట గుహల్లోకి వెళ్లి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి దీపాన్ని వెలిగించనున్నారు. తర్వాత సోమవారం నుంచి 8గోత్రాల కటోడాల ఆధ్వర్యంలో ఆదివాసీ భక్తులు ఉత్సవాలు జరుపుకునేందుకు, సిద్ధమవుతున్నారు. పుష్యమాసంలో నెలరోజుల పాటు జరుపుకునే వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తుంటారు. కొన్ని వేల సంవత్సరాల చరిత్ర గల ఈ పుణ్యస్థలంలో ఇప్పటికీ భక్తులు తమ ఆచార వ్యవహారాలతో నియమాలు పాటిస్తూ వేడుకలను ఘనంగా జరుపుకుంటారు. అత్యంత దైవశక్తి, ఎన్నో మహిమలు గల ఈ అమ్మవారి ఆచారాలు కూడా అంతే కఠినంగా ఉంటాయి. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి గోండు, పర్ధాన్, కొలాం తెగలకు చెందిన ఆదివాసీలు యేటా తరలివస్తూ మొక్కులను తీర్చుకుంటారు. జంగుబాయి వేడుకలకు సమయం ఆసన్నమవడంతో ఆదివాసీలు ఆరాధ్యదైవాన్ని దర్శించుకునేందుకు, పూజ, నైవేద్యానికి సంబంధించిన వస్తువులతో అన్ని ప్రాంతాల ఆదివాసీలు సిద్ధమవుతున్నారు. పుష్యమాసం నెలవంక కనిపించిన రోజు నుంచి వచ్చే అమవాస్య వరకు ఆదివాసీలు ప్రత్యేక నియమాలు పాటిస్తూ దర్శించుకుంటుండడంతో ఆలయ ప్రాంతం సందడిగా మారనుంది.

● ఆదివాసీలకు పవిత్రమాసం

పుష్యమాసం నెలవంక కనిపించిన రోజు నుంచి అమవాస్య వరకు ఆదివాసీలు పవిత్ర మాసంగా కొలుస్తారు. ఇల్లు, వాకిలి శుభ్రపర్చి, ఆవు పేడతో అలుకు చల్లి పవిత్రంగా ఉంటారు. పాదరక్షలు ధరించకుండా, మద్య పానానికి దూరంగా ఉంటూ నెలరోజులపాటు మంచం వీడి నేలపైనే నిద్రిస్తారు. అమ్మవారిని కొలిచే భక్తులు హోటల్‌లోని భోజనం, తాగు నీరుసైతం ముట్టకుండా ఇంటివంటలకే పరిమితమవుతారు. ముందుగా తుమ్రం, కొడప, సలాం, రాయిసిడాం, హెర్రెకుమ్ర, మరప, వెట్టి, మందడి(8 గోత్రాల) కటోడాలు పుష్య మాసం మొదటిరోజున దేవుని వద్దకు కాలిన డకన వెళ్లి రాత్రిపూట దీపారాధన చేసి ప్రత్యేక నైవేద్యం సమర్పిస్తారు. అప్పటి నుంచి వారు అక్కడే ఉంటూ నిత్యం ప్రతిరోజు హాజరయ్యే భక్తులకు సంప్రదాయ పూజలు చేయిస్తారు.

● స్వరాష్ట్రంలోనే దేవతకు గుర్తింపు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో జంగుబాయి దేవతకు ప్రత్యేక గుర్తింపు దక్కిం ది. పుష్య మాసంలో ఆదివాసీలు వేడుకలను నిర్వహించేందుకు యేటా రూ.10 లక్షలు మంజూరు చేస్తూ వచ్చింది. ఇదే కాకుండా భక్తుల సౌకర్యార్థం ఓ భవనం, షెడ్లు నిర్మించి టొప్లకస వాగు వద్ద కల్వర్టు, సీసీ రోడ్డు నిర్మించింది. మరోవైపు మహారాష్ట్ర ప్రభుత్వం సైతం మహారాజ్‌గూడ నుంచి ఆలయం వరకు సీసీ, బీటీ రోడ్డు నిర్మించి టొప్లకస వాగుపై వంతెన నిర్మించి రవాణా సౌకర్యాన్ని కల్పించింది. మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు, విద్యుత్ లైట్లతో పాటు సోలార్ ల్యాంపు ఏర్పాటు చేసింది.

రేషన్ బియ్యం పట్టివేత

కాగజ్‌నగర్ : టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

కాగజ్‌నగర్, జనవరి 13: కాగజ్‌నగర్ మండలంలోని వంజిరి గ్రామ సమీపంలో అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శనివారం పట్టుకున్నట్లు టాస్క్ ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని తాండుర్ మండలం నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు స్పష్టం చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ ఏరియాకు చెందిన కిషోర్‌కు సంబంధించిన మినీవ్యాన్ టీఎస్07యుఎఫ్4369 వాహనంలో రేషన్ బియ్యం తరలించినట్లు పేర్కొన్నారు. బియ్యం తరలించిన వాహనంతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ సందీప్ కుమార్, సిబ్బంది మధు, రమేశ్, సంజీవ్ ఉన్నారు.

ఘనంగా ఎంపీపీ జన్మదినం

కార్యకర్తలు,అభిమానులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న ఎంపీపీ నానయ్య

చింతలమానేపల్లి, జనవరి 13 : మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో శనివారం ఎంపీపీ డుబ్బుల నానయ్య జన్మదిన వేడుకలను తన కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా వేడుకలను నిర్వహించిన కార్యకర్తలకు, అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ బింకరి నారాయణ, ఆల్గం మల్లేశ్, తొంబిరె మారుతి, శ్రీనివాస్, సురేశ్ ,దరి ప్రవీణ్, అంజన్న, ఆకాశ్, మహేశ్, గేట్ల శంకర్, భీమయ్య, మహేందర్ గౌడ్, చేతన్, జగదీశ్ పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు ప్రవర్తన మార్చుకోవాలి

పోలీసుస్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ దీకోండ రమేశ్

సిర్పూర్(టీ), జనవరి 13 : మండలకేంద్రంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో శనివారం మండలంలోని వేర్వేరు కేసుల్లో ఉన్న సస్పెక్ట్, హిస్టరీ షీటర్లు, రౌడీ షీటర్లకు సిర్పూర్(టీ) ఎస్ఐ దీకోండ రమేశ్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై నిఘా పెట్టామన్నారు. ప్రతి ఒక్కరూ తమ ప్రవర్తనను మార్చుకోవాలని సూచించారు. నేర ప్రవృత్తిని వీడి ప్రజలతో మమేకమవుతూ మంచి జీవనం సాగించాలన్నారు. ప్రజా జీవనానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో ఏలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ సూచించారు.

అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్ర

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్: శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

టోంకినిలో అక్షింతలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి13 : మండలంలోని రాజుర గ్రామంలో శనివారం శ్రీ అయోధ్య రామమందిర పూజిత అక్షింతలను గ్రామ పెద్దలు స్థానిక అంజనేయ ఆలయంలో ప్రత్యేక భజన, పూజ కార్యక్రమాలు చేసి శోభాయాత్రను కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటికీ అక్షింతలను పంపణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు బొట్టుపల్లి గోపాల్, రామయ్య, బిజ్జు, సాంబయ్య, లొనారే జయరాం, పుల్లయ్య, పుంజయ్య, పాండు, దుడిసే ఆత్మారామ్, కురట్కార్ గుణవంత్‌రావు, నారాయణ, పిప్రె మల్లయ్య, టొంబ్రె గోవిందరావు, యువకులు తదితరులు ఉన్నారు.

● సిర్పూర్(టీ)లో..

సిర్పూర్(టీ), జనవరి 13: అయోధ్య అక్షింతలను శనివారం మండలకేంద్రంలోని పలు కాలనీలతో పాటు టోంకినిలో శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యం లో టోంకిని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆనంతరం గ్రామంలోని ప్రతిఇంటికి అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పిప్రె రాందాస్, మా రుతి, ఆలయ పూజారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ చొరవతోనే పంపిణీకి అంగీకారం

మాట్లాడుతున్న ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి

రెబ్బెన, జనవరి 13 : సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ చొరవతోనే వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా కారులకు అందించాల్సిన క్రీడా సామగ్రి, క్రీడా దుస్తువులు అందించేందుకు సింగరేణి యాజమాన్యం అంగీకరించిందని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి స్పష్టం చేశారు. ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2021, 2022 సంవత్సరానికి ఇవ్వాల్సిన క్రీడా సామగ్రి, దుస్తులు అందించక పోవడంతో క్రీడాకారులు అసహనం వ్యక్తం చేయగా ఈ విషయం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్‌ల దృష్టికి తీసుకెళ్లగా ప్రత్యేక చొరవ తీసుకొని కార్పోరేట్ స్థాయిలో సింగరేణి డైరక్టర్లతో మాట్లాడి సమస్య వివరించగా స్పందించిన యాజమాన్యం అన్ని ఏరియాలకు క్రీడా సామగ్రి, దుస్తులు అందించడం కోసం ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. ఖైర్‌గూడ ఓసీపీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శులు కిరణ్‌బాబు, జూపాక రాజేశ్, నాయకులు నరేశ్, సురేశ్ కోరి, సమీలు ఉన్నారు.

సర్పంచ్‌ల పదవీ కాలాన్ని పొడిగించాలి

కెరమెరి: మాట్లాడుతున్న సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు కుమ్రం నాణేశ్వర్

కెరమెరి, జనవరి 13: గ్రామపంచాయతీ సర్పంచుల పదవీ కాలాన్ని పొడిగించాలని సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు కుమ్రం నాణేశ్వర్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31న పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో వచ్చే జూన్ 31 వరకు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఆదే నారాయణ, తొడసం జగన్నాథ్‌రావ్ నాయకులు భీంరావ్, లాల్‌షావ్, బాలాజీ ఉన్నారు.

● వాంకిడిలో..

వాంకిడి, జనవరి 13: గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీ కాలం ఈ నెల 31వ తేదీతో ముగుస్తున్న నేపథ్యంలో పదవీ కాలన్ని జూన్ వరకు పొడిగించాలని మండల సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు సర్పంచ్ బండే తుకారాం సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు శనివారం విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభు త్వం విడుదల చేయాలన్నారు. సర్పంచ్‌ల గౌరవ వేతనాన్ని రూ.6500నుంచి 20వేలకు పెంచాలని, పదవీ కాలంపూర్తైన సర్పంచ్‌లకు పెన్షన్ విధానం అమలు చేయాలని కోరినట్లు సర్పంచ్ తెలిపారు.

జాతీయ స్థాయి పోటీల్లో ఆదర్శ విద్యార్థుల ప్రతిభ

పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన మోడల్ స్కూల్ విద్యార్థి వినీల్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 13 : జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీల్లో రాష్ట్ర జుట్టుకు ప్రాతినిధ్యం వహించి స్వర్ణ, కాంస్య పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఈనెల 11, 12 వ తేదీల్లో నెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీల్లో అండర్-17 విభాగంలో పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి ఎర్ర వినీల్ జాతీయ స్థాయి స్వర్ణ పతకం సాధించి సత్తా చాటగా అండర్-19 విభాగంలో ఇంటర్ విద్యార్థులు డి.అంజన్న, ఎం.అభిసాయి నెట్ బాల్ ఫాస్ట్5 విభాగంలో కాంస్య పతకం సాధించారు. అదేవిధంగా సీనియర్ బాలికల విభాగంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు దియా సర్కార్, ఫాస్ట్ 5 విభాగంలో గోలెం హర్షిత, ఏ.వైష్ణవి తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయుడు బి. తిరుపతి, నెట్ బాల్ జిల్లా అధ్యక్షుడు అలిబిన్ అహ్మద్, ఉపాధ్యాయ బృందం, యాజమాన్య కమిటీ చైర్మన్ ప్రేమ్ కుమార్, సభ్యులు అభినందించారు.

విజేతగా నిలిచిన మోడల్ స్కూల్ విద్యార్థులు

కుమ్రం భీం విగ్రహం ఆవిష్కరణ

చింతలమానేపల్లి, జనవరి 13: జల్ జంగల్ జమీన్ అంటూ నిజాం ప్రభుత్వం గుండెల్లో రైళ్లు పరుగెత్తించి దున్నేవాడిదే భూమి అంటూ గిరిజనుల విముక్తి కోసం విరోచిత పోరాటం చేసి అమరుడైన గిరిజన ముద్దు బిడ్డ కుమ్రం భీం అని బీఎస్పీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని గంగపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని అంబగట్టలో ఏర్పాటు చేసిన కుమ్ర ం భీం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కుమ్రం భీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మహనీయుడు కుమ్రం భీం విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం ఇచ్చిన అంబగట్ట గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్లమెంట్ ఇన్‌చార్జి సిడాం గణపతి. ఆదివాసీ మండలాధ్యక్షుడు బుర్రి నీలయ్య సర్పంచ్‌లు గోమాసి విలాస్, మొర్లే గణపతి, నాయకులు లెండుగురే శ్యాంరావ్, గెడెం నగేశ్ , రాజ్‌కుమార్. అమ్మ శ్రీకాంత్ యాదవ్, గోమా సి లహంషు, డోకే తిరుపతి, మధునక్క, సునీత, డోకే ప్రకాశ్, శంకర్, శ్రీను, నరిసింహులు, అశోక్, అంజన్న , కొండయ్య, శేఖర్, విజయ్, సత్తయ్య, అర్జయ్య, భీంరావ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

● టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు

గోలేటి టీబీజీకేఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న మల్రాజు శ్రీనివాసరావు

రెబ్బెన, జనవరి 13: సింగరేణిలో ఎక్స్‌ట్రాన్నల్ ద్వారా నియమించిన 146 మంది జూనియర్ అసిస్టెంట్‌లను సింగరేణి యాజమాన్యం వెంటనే విధుల్లోకి తీసుకోవాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గోలేటిటౌన్‌షిప్ లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సంవత్సరం సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్‌ల కోసం పరీక్షలు నిర్వహించి గత నెలలోనే వారికి అపాయింట్ మెంట్ లెటర్‌లు అందించి వివిధ ఏరియాలకు పోస్టింగ్ కూడా ఇచ్చారన్నారు. వారందరూ పోస్టింగ్ తీసుకొని ఉద్యోగంలో చేరిన రెండో రోజున సింగరేణి ఎన్నికల అనంతరం డ్యూటీలోకి రావాలని అప్పటివరకు ఆగాలని చెప్పి సింగరేణి యాజమాన్యం వారి విధులను నిలిపి వేశారని చెప్పారు. ఎన్నికలు ముగిసి రెండు వారాలు గడుస్తున్నప్పటికీ వారిని విధుల్లోకి తీసుకోకపోవడం చాలా అన్యాయమన్నారు. ఇప్పటికైనా వారందరిని విధుల్లోకి తీసుకోవాలని, అలాగే కౌన్సిలింగ్ ద్వారా వివిధ ఏరియాలకు బదిలీలు పెట్టుకున్న క్లరికల్ స్టాఫ్‌ను రిలివింగ్ చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ మాజీ ఉపాధ్యక్షుడు నల్లగొండ సదాశివ్, కేంద్ర కమిటీ నాయకుడు దారావత్ మంగిలాల్, ఏరియా నాయకులు గజెల్లి చంద్రశేఖర్, కోగిలాల రవీందర్, మారిన వెంకటేశ్వర్లు, మాంతు సమ్మయ్య, మైదం వీరస్వామి, ఫిట్ కార్యదర్శులు కార్నాథం వెంకటేశం, గురజాల రమేశ్, కమిటీ సభ్యులు దేవేందర్, బొంగు వెంకటేశ్, ఓరం కిరణ్, కైత స్వామి, గణేశ్, వంగ మహేందర్‌రెడ్డి పలువురు ఉన్నారు.

నేడు ముగ్గుల పోటీలు

వాంకిడి, జనవరి13: సంక్రాంతి పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల యువజన సంఘం నాయకుడు దుర్గం ప్రశాంత్ శనివారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.5వేలు,ద్వితీయ బహుమతిగా రూ. 2500,తృతీయ బహుమతిగా రూ. 1000 అందించనున్నట్లు తెలిపారు.

OWN BUSINESS OFFER

★18-28 సం॥ల యువతీ యువకులకు Rs. 49,000/- ల స్వల్ప పెట్టుబడిలోనే లోకల్ ఫ్రాంచైజీతో పర్మినెంట్ బిజినెస్ ఆదాయం. మల్టీసర్వీసెస్+ట్రైనింగ్+డైలీ సపోర్ట్ @ 15 సం॥ల నమ్మకమైన సర్టిఫైడ్ సంస్థ W.W.I-Hyd. Ph: 9908743603.
NT-2580-AII

SPOKEN ENGLISH

★ Speak English in 30 Days, M.S. Spoken English Classes - Easy way to Speak English, online/offline batches, Kaghaznagar. Cell: 9989693418.
NTK-317219

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.